# మౌనమే నీ భాష

ఉపనిషత్ వాక్యం

యస్మాద్వాచో నివర్తన్తే అప్రాప్య మనసా సహ।
యన్మౌనం యోగిభిర్గమ్యం తద్భజేత్ సర్వదా బుధః॥
(తేజోబిందు ఉపనిషత్తు 1-20)

'ఏ ఆత్మను చేరుకోలేక వాక్కులు, మనసుతో కూడ వెనుకకు మరలుతున్నవో, యోగులు పొంద దగిన మౌనమేదో, అటువంటి మౌనాన్ని పండితుడు అవలంబించాలి..' అని పై శ్లోకానికి భావం. అటువంటి పరిపూర్ణమైన మౌనానికి ప్రతీకలైన మహానుభావులు రమణ మహర్షి. రమణుల మొదటి పేరు వెంకటరామన్. ఆత్మజ్ఞానం కోసం ఇల్లు విడిచి వెళ్లిపోయాడు. కొడుకును వెతకడానికి బావగార్లయిన సుబ్బయ్యరు, నెల్లి అప్పయ్యరును తల్లి అళగమ్మ ప్రాధేయపడింది.



వెంకటరామన్ ఓ నాటక కంపెనీలో చేరాడని విని అప్పయ్యరు త్రివేంద్రం వెళ్లి విచారిస్తే ఫలితం లేకపోయింది. తల్లి స్వయంగా వెళ్లి కొడుకు పోలికలు ఉన్న ఓ బాలుణ్ని చూసింది. పిలిచినా పలుకకుండా అతడు జనాల్లో కలిసిపోయాడు. ఆమె దుఃఖించింది. సుబ్బయ్యరు కర్మకాండలకు హాజరైన ఒకరు వెంకటరామన్ తిరువణ్నామలైలో మహాయోగిలాగా ఉన్నాడని చెప్పారు. అప్పయ్యరు అక్కడికి వెళ్లాడు. ఒక మామిడి తోటలో వెంకటరామన్ కనిపించాడు. అక్కడ కొత్తవారిని రానీయడం లేదు. తన చిరునామా కాగితం మీద రాసి లోపలికి పంపించాడు. వెంకటరామన్ మౌనముద్రలో ఉండిపోయాడు. కనీసం ఆయన వంక చూడలేదు. అప్పయ్యరు ఎంతో ప్రయత్నం మీద వెంకటరామన్‌ను కలిసి ఏదో మాట్లాడినా వ్యర్థమే అయింది. అళగమ్మకు విషయం జాబు రాసి, తిరుగు ప్రయాణమయ్యాడు. అళగమ్మ తన పెద్దకొడుకైన నాగస్వామితో తిరువణ్నామలై చేరుకున్నది. కొడుకును గుర్తించింది. ఆయన మౌనముద్రలోనే ఉన్నాడు. ఎంతో బతిమాలింది. ఇంటికి తిరిగి వచ్చేయమని ఏడ్చింది. ఆయన ఇవేం గమనించలేదు. దూరంగా వెళ్లిపోయాడు. పచ్చి అప్పపిల్లే అనే వ్యక్తి కాగితం పెన్సిలు స్వామికిచ్చి 'ఏదైనా రాయండి' అని వేడుకున్నాడు. అప్పుడు స్వామి 'ప్రతి ప్రాణి తన ప్రారబ్ధ కర్మను అనుసరించి జీవితం ఎలా జరగాల్సి ఉంటే అలాగే దేవుడు నిర్ణయిస్తాడు. మానవులు ఎంత ప్రయత్నించినా కాకూడనిది కానేరదు. కానున్నది కాకుండా పోదు. కర్మ అవశ్యం అనుభవించవలసినదే! కాబట్టి తిరిగిపోవడమే ఉత్తమం' అని అందులో రాశారు. అలా ఆత్మజ్ఞానానికి పరిపూర్ణమైన మౌనమే శరణ్యమని చాటి చెప్పారు భగవాన్ రమణ మహర్షి.

... డా.వెలుదండ సత్యనారాయణ

# వేరుశనగ గింజ

కథాసుధ

ఒక రైతు తన పదహారేండ్ల కొడుకును తీసుకుని గుడికి వెళ్లాడు. అక్కడ ఓ పండితుడు భగవద్గీత శ్లోకాలు చదివి వాటికి అర్థం చెబుతూ ఉన్నాడు. ఊరి జనమంతా అక్కడ పోగై ఉన్నారు. మంచి మాటలు నాలుగు చెవిలో వేసుకుందామని రైతు, తన కొడుకుతోపాటు అక్కడే కూర్చున్నాడు. కార్యక్రమం పూర్తయ్యాక ఇద్దరూ గుడిలోని దేవుడికి నమస్కరించి, ప్రసాదం తీసుకుని పొలాల మీదుగా ఇంటికి బయలుదేరారు. దారిలో కొడుకు 'ప్రేమించడం ఎందుకు మంచిది? కోపం ఎందుకు చెడ్డది?' అని ప్రశ్నించాడు. చిన్నగా నవ్విన తండ్రి అక్కడ ఉన్న వేరుశనగ తోటల్ని చూపాడు. 'ఒక్క వేరుశనగ గింజను మన భూమిలో నాటి నీళ్లు పోస్తే ఏమవుతుంది?' అని కొడుకును అడిగాడు. 'అది కూడా తెలియకుండా వ్యవసాయం చేస్తున్నానా! వేరుశనగ గింజ కొన్నాళ్లకు మొలకెత్తి మరో ఇరవై కాయలను మనకు అందిస్తుంది. అందులో ఒక్కో కాయకు రెండు నుంచి మూడు గింజలు వస్తాయి. అంటే ఓ గింజ, అరవై గింజలకు పైగా అవుతుంది' అని బదులిచ్చాడు. వెంటనే తండ్రి 'వేరుశనగ గింజను నాటి నీళ్లు పోయడం అనేది మనం ఇతరులను ప్రేమించడం లాంటిది. ప్రేమ అనే విత్తనాన్ని మన మనసులో నాటి దాన్ని ప్రోత్సహిస్తే అది వందలాది మధురమైన ఫలాలను ఇస్తుంది. అదే వేరుశనగ కాయను వేడి చేసి భూమిలో నాటి చూడు. ఎన్ని నీళ్లు పోసినా ఆ గింజ మొలకెత్తదు. వేడి చేసేటప్పుడు గింజకు మరింత సెగ తగిలితే ఆ గింజ మాడి మసై పోతుంది. కోపం కూడా అంతే. మనల్ని కోపం



ఆవహించినప్పుడు మంచీచెడ్డా తెలియదు. అది ఎదుటివారిని బాధపెట్టడమే కాకుండా మనం కూడా ఆ కోపానికి బలైపోతాం. అందుకే 'తన కోపమే తన శత్రువు, తన శాంతమే తన రక్ష' అని పెద్దలు చెబుతారు అని వివరించాడు. ప్రేమకు, కోపానికి వ్యత్యాసాన్ని తెలుసుకున్న కొడుకు తోటలోని ఓ వేరుశనగ మొక్కను పెరికి ఒక్కో గింజను కొరికి తింటూ తండ్రిని అనుసరించాడు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821

క్రీస్తు సందేశం


# మనిషి మళ్లీ ఎలా జన్మిస్తాడు?

'మనిషి మళ్లీ ఎలా జన్మిస్తాడు?' ఈ ప్రశ్నను నికొదేము ఒకసారి ప్రభువును అడిగాడు. నికొదేము యూదుల్లో ఓ ప్రముఖ వ్యక్తి. మతాధిపత్యం గలవాడు. యూదాపాలక మండలి సభ్యుడు కావడం వల్ల అధికారికంగా కూడా బలమైనవాడు. ఓ రోజు రాత్రి గుట్టుచప్పుడు కాకుండా అతను ప్రభువును కలిశాడు. తన సందేహాల్ని నివృత్తి చేసుకోడానికి ఆ రాత్రి ప్రభువుతో చర్చ సాగించాడు. ఆయన ఇలా దొంగచాటుగా రావడానికి కారణం, అప్పటికే యూదుల్లో ప్రభువు పట్ల ద్వేషం, అసూయాభావం ఏర్పడింది. అయినా, నికొదేముకు ప్రభువంటే చాలా ఇష్టం. ఆయన దేవుడు పంపగా వచ్చిన వాడని ప్రగాఢంగా నమ్మాడు. ఆయన అద్భుతాల్ని కండ్లారా చూసి మెచ్చినవాడు. 'నిత్య జీవం పొందడానికి నేనేం చేయాలి?' అనేది ఆయన వేసిన మొదటి ప్రశ్న. 'నిత్య జీవానికి తిరిగి పుడితే గానీ ఇది సాధ్యపడదు' అని ప్రభువు వివరించాడు. దీంతో తిరిగి జన్మించడంపై నికొదేముకు మరో సందేహం వచ్చింది. 'వయసుడిగిన వయోవృద్ధుడు చనిపోతే మళ్లీ ఎలా జన్మిస్తాడు?' అని మళ్లీ ప్రశ్నించాడు. 'మనిషి అగ్నితో గానీ, నీటితో గానీ శుద్ధీకరింపబడి మారిన మనసుతో కొత్తశైలితో ప్రవర్తిస్తే అదే కదా కొత్త జన్మ. శరీరం బాహ్యం. ఇహలోక సంబంధి. ఐహికం. ఆత్మ పారలౌకికం. మొదటి దానికి అనిశ్చితి తథ్యమైనా, రెండోది శాశ్వతం' అని ప్రభువు విశ్లేషణతో నికొదేముకు స్పష్టమైన వివేచన కలిగింది. ప్రభువుకు ధన్యవాదాలు చెప్పి తన మందిరానికి వెళ్లిపోయాడు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు,
98667 55024



శుకయోగి పరీక్షిత్తుతో... రాజా!
సరాముడైన శ్యాముడు ధనుశ్శాలకు వెళ్లి
వామహస్తంతో ధనుస్సును పైకెత్తి,
అల్లెత్రాడు బిగించి, వేదండం- ఏనుగు
ఇక్షుదండాన్ని- చెరకు గడను వలె, రెండుగా
విరిచాడు. ఆ ధ్వని వీనులకు భయంకరమై
కంసుని ధైర్యాన్ని భేదించింది. మీదికి వచ్చిన
చాప రక్షకులను రామకృష్ణులిద్దరూ
చెరో వింటి తుంట పట్టుకొని కొట్టి
మట్టుబెట్టారు. ఇలా మథురా నగరంలో
కడు వేడుకతో విహరించి సోదరులు తమ
విడుదులకు విచ్చేశారు. ఈ సందర్భంలో
అమాత్యుడు చేసిన సూర్యాస్తమయ
చంద్రోదయ వర్ణనలు సహృదయ
హృదయాహ్లాదకరంగా, సరసంగా సాగినై.
ఇందు- చంద్ర ఉదయానికి ముకుళించు
కొన్న ఇందీవరాలను- అరవిందాలను
(పద్మాలను) ఎంత హృదయంగమంగా
ఉత్ప్రేక్షించి వర్ణించాడో వీక్షించండి...






# వంశీధరుని కంస విధ్వంసనం

ఆ|| 'కళలు కలుగుగాక, కమల తోడగుగాక
శివుని మౌళి మీద జేరుగాక
నన్యునొల్ల దపనుడైన మత్పతియని
సాధ్వి భంగి గమల జాతి మొగిడె'.

తాను కళాధరుడు (చంద్రుడు)- కళలు ధరించిన వాడగు గాక, కమలాలయ- లక్ష్మికి తోబుట్టువగు గాక, సెగకంటి (శివుని) శిగ (తల) నెక్కి నిక్కుగాక, ఇంతవాడైనా అన్యుడైన చందురుని పొత్తు మాకు ఎంతమాత్రమూ అక్కర లేదు. తపనుడు- తపింప జేసేవాడైనప్పటికీ మా పతి తరణి- సూర్యుడే అని ఉత్తమురాలైన నాతి- పతివ్రత స్త్రీ వలె పద్మినీ జాతి మూతి ముడుచుకొందిట! ఆటవెలది ఐనా పై పద్యంలో 'సతీ ధర్మం' చాలా తేటగా- ఇల్లాలికి దీటైన బాటగా అప్రతిహతంగా నిరూపితమైంది. పోతన గావించిన ఇలాంటి వర్ణనలే భావి ప్రబంధ కవులకు 'మేలుబంతి' అయ్యాయి.

శుకుడు- రాజా! ఆ రాత్రి క్రూరుడైన భోజపతి కంసునికి ఓజ (శోభ, వికాసం) చెడి నిద్ర పట్టలేదు. దారుణమైన దుశ్శకునాలు చూచాడు. మృతికి హేతువైన భీతితో అతని మతి అతిగా కలత చెందింది. మరునాడు మల్లయుద్ధానికి సిద్ధమైన రంగంలో కంసుడు ఎత్తయిన మంచెపై మనసులో ఇంచుకైనా శాంతి లేకుండా కూర్చున్నాడు. నందాదులు కంసుని అనుజ్ఞతో ఉన్నత ఆసనాలను అలంకరించారు. రామకృష్ణులు రంగస్థలం ప్రవేశ ద్వారం వద్ద వేచి ఉన్న, తొండంతో కొండలను కూడా పిండి చేయగల 'కువలయాపీడమ'నే మత్త వేదండాన్ని- ఏనుగును చూచి సమీపించారు. అంత, మావటి మురభంజను- కృష్ణునిపై ఆ కుంజరాన్ని ఢీ కొలిపాడు. కువలయాపీడం- భూ వలయాన్ని- మానవజాతిని మిక్కిలిగా పీడించే మద, మోహ, దర్పాలకు చక్కని ప్రతీకం. ఈ ప్రసంగంలో కువలయాపీడ పుష్కరి (ఏనుగు)కి, అరిభయంకరుడైన పుష్కరేక్షణుడు హరికి మధ్య జరిగిన దుష్కరమైన పోరుని, వీర, భయానక, అద్భుత రసాలు ముప్పిరిగొనగా విద్యాదయితుడు పోతన హృద్యమైన గద్యలో పద్య పరిమళాన్ని గుబాళింపజేస్తూ వింగడించాడు. యదుసింహుడు ఆ మద కరీంద్రాన్ని తన పద తాడనం చే మర్దించాడు. మదించిన ఆ ఎక్కుడు మెకము (ఏనుగు), మొక్కవోని ముక్కంటి (రుద్రుని) భల్లం (బాణం) చే భగ్నమైన (త్రిపురాసుర) పురంలాగా, బక్కచిక్కి స్రుక్కి- సొమ్మసిల్లిపోయింది. గోవిందుడు చేతితో దాని దంతాలు ఊడబెరికి బాది దాన్ని చంపాడు. చెంతనుండి చూచు వారందరికీ వింత గొలుపగా అనంతుడు ఆ దంతాలతోనే దంతి పాలకులను- మావటులను అంతకుని లోకానికి పంపాడు. ఆపై వల్లవ- గోపకుమారులు రామకృష్ణులు ఉల్లాసంగా మల్ల భూమిని తిలకించారు.

సీ|| 'మహిత రౌద్రంబున మల్లుర కశనియై
నరుల కద్భుతముగ నాథుడగుచు
శృంగారమున బుర స్త్రీలకు గాముడై
నిజ మృత్యువై కంసునికి భయముగ
మూఢులు బీభత్సమును బొంద వికటుడై
తండ్రికి దయరాగ దనయుడగుచు
ఖలులకు విరసంబుగా దండియై గోప
కులకు హాస్యంబుగా గులజుడగుచు
ఆ|| బాంధవులకు బ్రేమ భాసిల్ల వేలుపై
శాంత మొనర యోగి జనుల కెల్ల
పరమ తత్త్వమగుచు భాసిల్లె బలునితో
మాధవుండు రంగ మధ్యమందు.'

బాదరాయణి శుకయోగి... రాజా! మల్ల రంగం మధ్య గోదా- అఖాడా (మల్లులు పోరాడే స్థలం)లో శృంగారాది సర్వరస కదంబమూర్తియైన త్రిభంగీ స్వరూపుడు దామోదరుడు తనను దర్శించిన వ్యక్తుల మనోభావాన్ని అనుసరించి వారికి ఆ రూపంగానే కనిపించాడు. మల్లురకు రౌద్రరసంతో వజ్రాయుధంగా, అద్భుత రసంతో ప్రజలకు ప్రభువుగా, శృంగార రసంతో చంద్రవదన (పౌరవనిత)లకు మూర్తిమంతమైన మదను- మన్మథునిగా, భయానక రసంతో కంసునికి మృత్యువుగా, బీభత్స రసంతో మూర్ఖులకు వికటమైన వానిగా, కరుణ రసంతో తండ్రికి కన్న కొడుకుగా, వీరరసంతో దుర్మార్గులను దండించేవానిగా, హాస్యరసంతో గోపకులకు కులదీపకునిగా, ప్రేమరసంతో బంధువులకు పరమాత్మగా, శాంతరసంతో యోగిజనులకు పరబ్రహ్మ స్వరూపునిగానూ భాసిల్లాడు. ఆ సమయంలో చచ్చిన కువలయాపీడాన్ని, వచ్చిన రామకృష్ణులనూ చూచి కంసుడు నొచ్చిన చిత్తంతో మిక్కిలి భయపడ్డాడు. ప్రజానాథుని చూచి ప్రజలందరూ 'మనుజ మాత్రుండె తలపోయ మాధవుండు'... ఆలోచింపగా దనుజమర్దనుడు మనుజమాత్రుడు- సామాన్య మానవుడు కాదు అని తలపోశారు.

శుకుడు- రాజా! ఆనాడే మల్ల యుద్ధ క్రీడల మహోత్సవం. ప్రజల దృష్టిలో దానికి వినోదమే ప్రయోజనం. కానీ, చాణూర ముష్టికులచే నందుని పట్టిని మట్టుబెట్టించడం పాలకుడైన కంసుని పరమార్థం. శ్రీకృష్ణ చాణూర సంభాషణని పోతన నాటకీయ శైలిలో చాల రమణీయంగా వర్ణించాడు. కృష్ణరాములిద్దరూ ఆ జెట్టీలను ఘోరమైన తమ ముష్టిఘాతాలతో మట్టికరిపించారు. బలుడు ముష్టికుని మిత్రులైన కూట, తోశల, శలులను కూడా తలలు బద్దలుకొట్టి కాలుని వద్దకు పంపాడు. ఈ లోకమెల్ల ఒక మల్లరంగం. కామక్రోధాలే చాణూర ముష్టికులు. సాధకులందరూ బాధకులైన ఈ మల్లురతో, బల్లిదు (బలవంతు)లతో ఎల్లకాలం- జీవితాంతం పోరాడుతూనే ఉండాలి. ఇవి అనాదిగా జీవులను పట్టి పల్లార్చుతూనే ఉన్నాయి. ఈ దనుజులను దునుమాడటమే మనుజావతార- మానవ జన్మ ప్రయోజనం!

ఆపై యదుకుల సింహ కిశోరుడు హరి కంసుని సంహరింప సన్నద్ధుడై యుద్ధోత్సాహంతో గురిచూచి మంచె మీదికి దూకాడు. పక్షిరాజు గరుత్మంతుడు పామును పట్టే విధంగా పంకజాక్షుడు జగజెట్టి కృష్ణుడు కంసుని జుట్టు ముడి పట్టుకొని మల్లభూమి మీదికి పడదోశాడు. క్షాత్ర కులావతంసుడైన కంసుడు అక్కడే ఎట్టి కదలిక లేక కట్టెలాగ బిగుసుకు పోయాడు. ఓ పరీక్షి న్నృప రాజా!

క|| 'రోష ప్రమోద నిద్రా
భాషాశన పాన గతుల బాయక చక్రిన్
దోషగతి జూచియైన వి
శేష గతిన్ గంసుడతని జెందె నరేంద్రా!'

కంసుడు రోషంలో, సంతోషంలో, నిద్రలో, సంభాషణ భోజన సమయాల్లో, క్షీర నీర తక్ర (మజ్జిగ) మొదలైన పానీయాలు సేవించే వేళల్లో చక్రపాణి కృష్ణుని వక్రగతి- ద్వేష దోషబుద్ధితోనే చూచాడు. అయినా ఈ నిరంతర ధ్యాన- చింతన ఫలంగా వానికి, మహాయోగులకు, తాపసులకు కూడా దుర్లభమైన సారూప్యముక్తి లభించింది. కంసుని సోదరులు న్యగ్రోధాదులు ఆగ్రహోదగ్రులై కృష్ణుని మీదికి విజృంభించగా బలుడు వారిని బలి తీసుకొన్నాడు. బ్రహ్మాది దేవతలు పూలు జల్లులు కురిపించారు. దేవ దుందుభులు మ్రోగాయి. దేవాంగనలు నాట్యమాడారు. జరాసంధుని పుత్రికలు, కంసపత్నులు- అస్తి, ప్రాప్తి తలలు బాదుకుంటూ...

క|| 'భూతముల కెగ్గు సేసిన
భూతంబులు నీకు నెగ్గు బుట్టించె వృథా
భూతమగు మనికి యెల్లను
భూతద్రోహికిని శుభము బొంద దధీశా!'

'నాథా! ప్రాణులను నీవు పీడించగా ఆ ప్రాణులే నీకు కీడు చేశాయి. భూతము- ప్రాణులకు ద్రోహం చేసిన వానికి ఎప్పటికీ హితం- మేలు కలుగదు. జీవితం హతాహతం- వ్యర్థమై పోతుంది. కోపతాపాలు, పాపాలు వీడి గోపాలకృష్ణుని సేవించి ఉంటే ఎంత బాగుండేది?' అంటూ రోదించారు. ఇలా విలపిస్తున్న ఇల్లాండ్రను ఓదార్చి కృష్ణుడు కంసాదులకు పరలోక సంస్కారాలు చేయించాడు. కంసుడు అభిమాన- దేహాత్మ బుద్ధి స్వరూపుడు. రోజంతా 'అస్తి- ఉన్నది, ప్రాప్తి- ఇకముందు పొందను న్నది' అన్న ఆలోచనతో, ఆ మోజుతో గడుపువాడే భోజపతి కంసుడు.

అనంతరం నందనందనుడు తల్లిదండ్రుల- దేవకీ వసుదేవుల బంధనాలు విడిపించి బలరామునితో కూడి వారికి వందనాలు చేశాడు. 'తమ పుత్రులు సర్వలోక ప్రభువులే!' అన్న వారి ఎఱుకను ఉరుక్రముడు మరుక్షణమే మాయను ప్రయోగించి తొలగించాడు. కన్నయ్య వినయ వినమ్రుడై ఇలా అన్నాడు... అమ్మా! నాన్నా! మీరు మమ్ము కన్నారే కానీ, లాలించి పాలించే భాగ్యానికి నోచుకున్నారు కాదు. మీ ఒడిలో బుజ్జగింపులతో కలివిడిగా ఎదిగే సుడి- అదృష్టం ఈ బుడతలకి ఇన్నాళ్లూ లేకపోయింది. పురుషార్థ సాధకాలైన మా ఈ శరీరాలకు కర్తలు మీరే కదా! ఎన్ని ఏళ్లకైనా మీ ఋణం తీర్చుకోలేము.

క|| 'చెల్లుబడి గలిగి యెవ్వడు
తల్లికి దండ్రికిని దేహధనముల వృత్తుల్
సెల్లింప డట్టి కష్టుడు
ప్రల్లదుడా మీద నాత్మ పలలాశి యగున్.'

చెల్లుబడి- సమర్థత ఉండి కూడా తన తను(శరీరం) మన ధనములతో తల్లిదండ్రులను సేవించని వాడు కష్టుడు, దుష్టుడు, భ్రష్టుడు, నికృష్టుడూనూ. వాడు మరణించి పరలోకాన తన తరసాన్నే- మాంసాన్నే తింటాడు.

క|| 'జననీ జనకుల వృద్ధుల
దనయుల గురు విప్రసాధు దారాదులనే
జనుడు ఘనుడయ్యు బ్రోవక
వనరును జీవన్మృతుండు వాడు ధరిత్రిన్.'

'ఏ మానవుడు మాతా పితరులను, వయోవృద్ధులను, కన్నబిడ్డలను, గురువులను, బ్రాహ్మణులను, సాధు సంతులను, అర్ధాంగి మొదలైన వారిని శక్తి సామర్థ్యాలు కలిగి ఉన్నా పోషింపక, దీనాలాపాలు ఆడుతూ దేబరించే- యాచించే వాడు ఈ ధరణిపై బ్రతికి ఉన్నా మృతి చెందిన వాడే!' అదీకాక, జననీ జనకులారా! కంసుడు మిమ్ములను కారాగృహంలో ఉంచి బాధిస్తున్నా, సామర్థ్యం ఉండి కూడా వానిని వారించని నిర్దయులం, క్రూరులం, కపటులం. క్షమాశీలులారా! మా లోపాలు- తప్పులు ఓర్చి మమ్ము క్షమించండి, అక్కున చేర్చుకోండి.



తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

# దైవభీతిని నింపే తఖ్వా

ఇస్లాం బోధ

దైవభీతి అంటే అల్లాహ్ ఎల్లప్పుడు తనను చూస్తున్నాడనే ఎరుకతో ఉండటం. ఉపవాసాలు దైవభీతిని జనింపజేస్తాయి. దైవభీతిని ఖురాన్ పరిభాషలో 'తఖ్వా' అంటారు. తఖ్వా కలిగిన మనిషి పాపాలకు దూరంగా ఉండి, అల్లాహ్ ఆగ్రహానికి గురికాకుండా ఉండేందుకు ప్రయత్నిస్తాడు. అల్లాహ్ ఆజ్ఞలను పాటిస్తూ, ఆయన పట్ల అవిధేయతకు దూరంగా ఉంటాడు. దైవం పట్ల భయభక్తులు మనిషికి గొప్ప ప్రేరణనిస్తాయి. మనిషిని అల్లాహ్‌కు పూర్తి విధేయుడిగా మార్చి, పాపాలకు దూరంగా ఉండేలా చేసే గుణమిది. అల్లాహ్ నిఘాలో ఉన్నామనే గొప్ప చైతన్యాన్నిచ్చే అవకాశం తఖ్వా. మనిషిలో ధార్మిక విశ్వాసాన్ని ఆచరణలుగా మార్చే మార్గమిది. మనిషిని పాపాలనుంచి నిరోధిస్తుంది. పుణ్యాల వైపు నడిపిస్తుంది. ఏడాదంతా ఈ స్ఫూర్తిని నింపడమే రంజాన్ ఉపవాసాల ఆశయం. ఉపవాసం పాటించేవారు అబద్ధం, మోసం, దొంగతనం, లంచం లాంటి చెడులకు దూరంగా ఉంటారు. ఇలాంటి సుగుణాలను రంజాన్ ఉపవాసాలు ప్రేరేపిస్తాయి. నెల రోజుల సుశిక్షణ ఏడాదంతా కొనసాగించేలా చేయాలన్నదే అల్లాహ్ ఉద్దేశం. ఉపవాసం పాటించే



వ్యక్తి స్వయంగా ఆకలిని అనుభవించడం వల్ల అన్నార్తుల పట్ల సానుభూతి, జాలి జనిస్తాయి. ఫలితంగా, ఆకలితో ఉన్నవారికి అన్నాన్ని అందించే ప్రయత్నాలు చేస్తారు. దానధర్మాలు, సదకాలు, జకాత్, విరాళాలను విరివిగా అందిస్తారు. రంజాన్‌లో ఉపవాసులకు భోజనం పెట్టాలని ప్రోత్సహించడం జరిగింది. భోజనం పెట్టినవారికి కూడా ఉపవాసికి సమానమైన పుణ్యం లభిస్తుంది. ఉపవాసి స్వయంగా పొందే పుణ్యంలోను ఎలాంటి తగ్గుదల ఉండదు. ధర్మపరులు, సేవా సంస్థలు ప్రత్యేకంగా రంజాన్ మాసంలో ఇఫ్తార్, సహరీలకు భోజన ఏర్పాట్లను నిర్వహిస్తుంటారు. రంజాన్ తర్వాత కూడా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టే అలవాటు పెంపొందించుకోవాలి. 'ఆకలి కడుపుతో ఇరుగుపొరుగు నిద్రిస్తున్నప్పుడు తాను కడుపునిండా తినే వాడు విశ్వాసి కాదు' అని పేర్కొన్నారు ప్రవక్త ముహమ్మద్ (స). మొత్తంగా రంజాన్ ఉపవాసాలు అందించే సుగుణాలను కడవరకూ పాటించేవాడే నిజమైన విశ్వాసి!

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

# నియంత్రణే సాధన

సంపూర్ణ ఆత్మ దర్శనం పొందిన వ్యక్తి భగవంతుడి దర్శనాన్నే పొందగలుగుతాడు. ఈ క్రమంలో 12 సాధనలు ఉన్నాయన్నాడు శ్రీకృష్ణభగవానుడు. గీతలోని 18వ అధ్యాయం మూడు శ్లోకాలలో (51, 52, 53) వాటిని వివరించాడు. ఈ పన్నెండిటిలో మూడు సాధన చేయగలిగినా ఆత్మబలం పునరుత్తేజం అవుతుంది. ఈ పన్నెండు సాధనల్లో మొదటిది బుద్ధిని పవిత్రంగా ఉంచుకోవడం, రెండోది దృఢనిశ్చయం కలిగి ఉండటం, ఆహారంపై నియంత్రణ, దేహాన్ని, మనస్సును, వాక్కును నియంత్రించడం అనేవి కూడా ముఖ్యమైన సాధనలు. క్రోధాన్ని దరిచేరనీయక పోవడం, శాంతంగా ఉండేందుకు తీవ్రమైన ప్రయత్నం చేయడమూ సాధనే. వీటిలో కొన్నిటిని సాధన చేసినా మనలో ఆత్మబలం నిండుతుంది. అదే మనకు శ్రీరామరక్ష అవుతుంది. అప్పుడు వారు ఎంతటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని విజయసీమలకు చేరగలుగుతాం.



... శ్రీ